సలాం.. సులానగర్!

- వైద్యసేవల్లో సత్తా చాటిన పీహెచ్‌సీ
- కేంద్రప్రభుత్వం నుంచి ఎన్‌క్వాస్ గుర్తింపు
- వైద్యులు, సిబ్బంది సమష్టి కృషికి దక్కిన ఫలితం

టేకులపల్లి: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తూనే.. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్న మండలంలోని సులానగర్ పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది శ్రమకు ఫలితం దక్కింది. కేంద్రప్రభుత్వం ఇచ్చే ప్రతిష్టాత్మకమైన ఎన్‌క్వాస్(నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్) గుర్తింపు వరించింది. మార్చి 22, 23వ తేదీల్లో ఎన్‌క్వాస్ బృందం సులానగర్ పీహెచ్‌సీని పరిశీలించి వైద్యసేవలు, సౌకర్యాలు ఇతరత్రా అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఈ మేరకు మొత్తం 88 మార్కులు కేటాయించడంతో కేంద్రప్రభుత్వం ఎన్‌క్వాస్ గుర్తింపు ప్రకటించింది. తద్వారా పీహెచ్‌సీకి మూడేళ్ల పాటు ఏటా రూ.3 లక్షల చొప్పున నిధులు మంజూరు కానున్నాయి. దీంతో మరిన్ని పరికరాలు కొనుగోలు చేసి ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందించే వీలు కలగనుంది.


సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

సండే స్పెషల్


పీహెచ్‌సీలోని ల్యాబోరేటరీ


పీహెచ్‌సీ వద్ద శానిటేషన్, హ్యాండ్ వాష్ ట్యాంక్

1971 నుంచి...

టేకులపల్లి మండలం ముత్యాలంపాడులో సుమారు 1971 ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. కొంతకాలం తర్వాత సులానగర్‌లో పీహెచ్‌సీ ఏర్పాటైంది. అనంతరం ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డులో ఐదెకరాల మూడు గుంటల విస్తీర్ణంలో ఆరు పడకల పీహెచ్‌సీని ప్రారంభించారు. 2015 నుంచి ప్రస్తుత భవనంలో వైద్యసేవలు ఆరంభమయ్యాయి. 50 వేల జనాభా గల టేకులపల్లి మండల వాసులకు ఇక్కడ నుంచి వైద్యం అందుతోంది. ఈ పీహెచ్‌సీకి అనుసంధానంగా టేకులపల్లి, బేతంపూడి, తడికలపూడి, బద్దు తండా, బోడు, కొప్పురాయి, ముత్యాలంపాడు, సులానగర్, కోయగూడెం, గంగారం, సంపత్‌నగర్, బొమ్మనపల్లి 12 ప్రాంతాల్లో ఆరోగ్య ఉప కేంద్రాలు(సబ్ సెంటర్లు) ఉన్నాయి. తాజాగా ఇందులో తడికలపూడి, బద్దుతండా, బోడు, కొప్పురాయి, గంగారం, సంపత్‌నగర్, బొమ్మనపల్లి కేంద్రాలను హెల్త్ వెల్‌నెస్ సెంటర్లుగా మార్చి పల్లె దవాఖానా వైద్యులను నియమించారు.

ఓపీ వందకు పైగానే...

సులానగర్ పీహెచ్‌సీలో ప్రస్తుతం ఒక్కరే వైద్యుడు విధులు నిర్వర్తిస్తున్నారు. అన్ని రకాలు మందులు అందుబాటులో ఉండగా.. రోజుకు ఓపీలో వంద మందికి పైగా వైద్యం అందుతోంది. నెలకు పదికి పైగా ప్రసవాలు చేస్తుండగా.. పనితీరు, సుఖ ప్రసవాలు తదితర అంశాల్లో ఈ పీహెచ్‌సీకి గతంలోనూ మూడు అవార్డులు లభించాయి. కాగా, ఈ పీహెచ్‌సీలో జనరేటర్ సదుపాయం కల్పించడమే కాక మరికొన్ని సౌకర్యాలు సమకూర్చాల్సి ఉంది.

సౌకర్యాల మాట ఎలా ఉన్నా వైద్యులు, సిబ్బంది మెరుగైన సేవలందిస్తుండడమే కాక ప్రభుత్వ కార్యక్రమాల అమలు, ప్రజలు వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడంలో ముందు నిలుస్తుండడంతో అవార్డు వరించింది.

అందరి కృషి ఫలితమే



పీహెచ్‌సీకి ఎన్‌క్వాస్ గుర్తింపు లభించడం ఆనందంగా ఉంది. ఇది సమష్టి కృషి ఫలితం. ఆస్పత్రిలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో అంకిత భావంతో పనిచేస్తున్నాం. ఎన్‌క్వాస్ గుర్తింపుతో మాపై బాధ్యత మరింత పెరిగినట్లయింది.

– కందుల దినేష్, వైద్యాధికారి

30 పడకలుగా అప్‌గ్రేడ్ చేయాలి



సులానగర్ పీహెచ్‌సీకి ఎన్‌క్వాస్ గుర్తింపు రావడం హర్షణీయం. అయితే 50వేల మంది జనాభా ఉన్నందున 30 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలి. అలాగే, ఖాళీగా ఉన్న వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టులు భర్తీ చేస్తే మరింత మెరుగైన వైద్యం అందుతుంది.

– భూక్యా రాధ, ఎంపీపీ, టేకులపల్లి

క్లుప్తంగా

డయాగ్నస్టిక్ సెంటర్లలో తనిఖీ

ఇల్లెందు: పట్టణంలో పలు ఆస్పత్రులను, డయాగ్నస్టిక్ సెంటర్లను వైద్యాధికారుల బృందం శనివారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఎం డీ.ఫయాజ్‌మోయినుద్దీన్, డాక్టర్ సుకృత ఆధ్వర్యాన తనిఖీ చేపట్టారు. సిబ్బంది అర్హత పత్రాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అనుమతి లేకుండా డయాగ్నస్టిక్ సెంటర్లు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం డాక్టర్ సుకృత, ఫయాజ్‌మొయినుద్దీన్‌లు ఇల్లెందులో యూఎఫ్‌డబ్ల్యూసీలోని ఏఎన్‌ఎంలతో సమావేశమై వ్యాక్సినేషన్‌పై సూచనలు చేశారు. ఉద్యోగులు అన్నామేరీ, భద్రమ్మ, టి.విజయకుమార్, వి.రమణారెడ్డి ఉన్నారు.

స్పాంజ్ ఐరన్ మాజీ డీజీఎం మృతిపై సంతాపం


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వనమా

చుంచుపల్లి/సింగరేణి(కొత్తగూడెం): స్పాంజ్ ఐరన్ మాజీ డీజీఎం సుంకర ఉమాప్రసాద్ (68) శుక్రవారం రాత్రి మృతి చెందారు. చుంచుపల్లి తండాలో మృతి చెందిన ఆయన మృతదేహం వద్ద శనివారం కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి మాట్లాడారు. సింగరేణి రిటైర్డ్ జీఎం పసుపులేటి శ్రీనివాసరావు, సర్పంచ్ ధనలక్ష్మితో పాటు శ్రీహరి, రాజు, సురేష్, బాబూరావు, రమేష్ తదితరులు ఆయన కుటుంబీకులను పరామర్శించారు. కాగా, చుంచుపల్లి తండాలో బీఆర్‌ఎస్ కార్యకర్త మంగీలాల్‌ను కూడా ఎమ్మెల్యే పరామర్శించారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన

ఇల్లెందురూరల్: బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ కొల్లాపురం గ్రామంలో గాదె నారాయణగౌడ్ స్మారకార్థం ఎన్ఆర్ఐ గాదె సోమయ్య ఆధ్వర్యంలో ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాల వైద్య బృందం శనివారం కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహించింది. ఆస్పత్రి వైద్యులు అచ్యుత్‌కుమార్, వంశీకృష్ణ గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోడు, మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో అన్నదానం చేశారు.

మోకాళ్లపై కూర్చుని నిరసన


నిరసన తెలుపుతున్న గ్రామపంచాయతీ సిబ్బంది

పాల్వంచరూరల్: గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక తహసీల్ ఎదుట గ్రామీణ గ్రామపంచాయతీ కారోబార్స్, సిబ్బంది యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షల్లో భాగంగా రెండో రోజు మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కారోబార్స్, బిల్ కలెక్టర్లను అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శులుగా ప్రత్యేక హోదా కల్పించి కనీస వేతనం రూ.21,500 ఇవ్వాలని, జీఓ 51 ప్రకారం వివిధ కేటగిరీల లో పనిచేస్తున్న సిబ్బందికి ప్రత్యేక హోదా కల్పించి కనీస వేతనం రూ.16,500 ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యం కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, గ్రామ పంచాయతీ సిబ్బంది మరణిస్తే రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. దీక్షలో లింబానాయక్, సీతారాములు, రవి, రామ్‌కుమార్, శేఖర్, రామకృష్ణ, తదితరులు కుర్చున్నారు.

దిష్టిబొమ్మ దహనం


దహనం చేస్తున్న భజరంగ్ దళ్ నాయకులు

పాల్వంచ: కర్ణాటక రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బజరంగ్‌దళ్‌ని నిషేధిస్తామని ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని విశ్వహిందూ పరిషత్ ఖమ్మం విభాగ్ అర్చక పురోహిత్ ప్రముఖ్ తేజావత్ రాములు నాయక్ అన్నారు. శనివారం స్థానిక కరకవాగులో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ హిందూ ద్వేషి అని మరోసారి బహిర్గతం చేసుకుందన్నారు. కార్యక్రమంలో గడిదేశి వెంకటేశ్వర్లు, గంగాధరి సీత, నాగమణి, లింబా నాయక్, తోట లక్ష్మి, సతీశ్, కిశోరి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం దక్కే వరకు పోరాటం..


పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న కామేష్

కొత్తగూడెంఅర్బన్: బహుజనులకు రాజ్యాధికారం దక్కే వరకు విశ్రమించొద్దని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. శనివారం పలువురు బీఎస్పీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కార్యాలయంలో కండువాలు కప్పి ఆహ్వానించారు. కామేష్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి బీఎస్పీని చేరువ చేద్దామని అందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. బూటకపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ రిజర్వేషన్లు ఎత్తివేసే కుట్రలు చేస్తోందని, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉద్యోగస్తులకు ఒకటో తేదీన జీతాలు కూడా ఇవ్వాలేని స్థితిలో ఉందని విమర్శించారు. కార్యక్రమంలో పాయం శారద, బండ సంజీవ్, గుమ్మడి లక్ష్మి, కంగల రాములు, తునికిపాటి బ్రహ్మచారి, పోగుల యాకూబ్, పోగుల అశోక్, బండ కృష్ణవేణి, బండ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై విద్యార్థుల ప్రదర్శన

పాల్వంచ: సోషల్ వెల్ఫేర్ గురుకుల బాలుర వసతి గృహం ఆధ్వర్యంలో 15 రోజులుగా విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో విద్యార్థులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రాఫిక్ రూల్స్‌పై ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. పట్టణ ఎస్సై నరేష్ మాట్లాడుతూ.. వేసవి సెలవులను వృథా చేయకుండా ప్రభుత్వం స్పార్కెల్స్ పేరుతో పలు పాఠశాలల్లో వేసవి శిక్షణ తరగతులు నిర్వహించి పలు అంశాల్లో విద్యార్థులను చైతన్య పరుస్తోందన్నారు. ట్రాఫిక్ రూల్స్‌పై ప్రతిఒక్కరూ అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ రోహిత్‌రాజు, ట్రాఫిక్ ఎస్సై నాగభూషణం, ప్రిన్సిపల్, సిబ్బంది పాల్గొన్నారు.


అంబేడ్కర్‌లో సెంటర్‌లో విద్యార్థుల ప్రదర్శన

కొనసాగుతున్న జేపీఎస్‌ల నిరసన


సంఘీభావం తెలుపుతున్న కోనేరు చిన్ని

చుంచుపల్లి: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెలో భాగంగా శనివారం తొమ్మిదో రోజు నిరసన కార్యక్రమం కొనసాగింది. సమ్మెలో భాగంగా మహిళా జేపీఎస్‌లు శిబిరం వద్ద బతుకమ్మ ఆటపాటలతో తమ సమస్యలను వ్యక్తపరుస్తూ నిరసన తెలిపారు. పలువురు జేపీఎస్‌లు కలెక్టరేట్ పక్కనే ఉన్న శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయానికి మోకాళ్లపై నడుస్తూ తమ సమస్యను పరిష్కరించేలా ప్రభుత్వానికి మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ సమ్మె శిబిరానికి హాజరై సంఘీభావం తెలిపారు. మాట్లాడుతూ.. జేపీఎస్‌ల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీ చెర్‌పర్సన్, వైఎస్సార్‌టీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గడిపల్లి కవిత జేపీఎస్‌ల సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు. జేపీఎస్‌ల వల్లే నేడు గ్రామాల రూపురేఖలు మారాయన్నారు. కార్యక్రమంలో వంశీకృష్ణ, సురేష్, నరేష్, పాష, నర్మద, షర్మిల పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

సింగరేణి(కొత్తగూడెం): 20 రోజులుగా వీఓఏలు సమ్మె చేస్తుంటే చర్చలకు పిలిచి సానుకూలంగా స్పందించాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నందున సమ్మెను ఉధృతం చేయాలని, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీరన్న పిలుపునిచ్చారు. శనివారం కొత్తగూడెంలోని చిల్డ్రన్స్ పార్క్ వద్ద దీక్షా శిబిరాన్ని సందర్శించి వీఓఏలకు సంఘీభావం తెలిపారు. మాట్లాడుతూ.. సీఎం, మంత్రుల మీటింగ్‌లకు, భహిరంగ సభలకు మహిళలను తీసుకొచ్చేందుకు ఉపయోగించుకునే మహిళా సంఘాలను ప్రభుత్వం నిర్వీర్యం చేయటం బాధాకరమన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేదంటే ఆందోళనా కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో రేష్మ, మాధవి, స్వరూప, సత్యవతి, అరుణ, రాజమణి, పద్మ, జహిద పాల్గొన్నారు.

జూలూరుపాడు: వీఓఏల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టీడీపీ వైరా నియోజకవర్గ నాయకుడు అరెం రామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూలూరుపాడులో వీఓఏల నిరహార దీక్షా శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. మాట్లాడుతూ... 20 రోజులుగా వీఓఏలు చేస్తున్న సమ్మెను ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కడియాల ఉమ, మోదుగు బాల కోటేశ్వరి, రుక్మిణి, బాపట్ల సత్యావతి, వీణారావ్, రామకృష్ణ పాల్గొన్నారు.


సింగరేణి(కొత్తగూడెం): మాట్లాడుతున్న వీరన్న

సింగరేణి ప్యాసింజర్‌కు హాల్టింగ్ ఇవ్వాలి

సుజాతనగర్: బేతంపూడి రైల్వే స్టేషన్‌లో సింగరేణి ఫాస్ట్ ప్యాసెంజర్‌ను ఆపాలని కోరుతూ.. సర్పంచ్ బానోత్ లలిత దంపతులు కొత్తగూడెం ఏరియా మేనేజర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. స్టేషన్‌లో రైలును ఆపకపోవడం వలన చాలామంది ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి నుంచి కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. రైల్వే అధికారులు తక్షణమే స్పందించి సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్‌కు హాల్టింగ్ ఇవ్వాలని కోరారు.

వీధి కుక్కలు తరలింపు

పాల్వంచ: మున్సిపాలిటీలో రోడ్లపై తిరుగుతున్న కుక్కలను మున్సిపల్ అధికారులు, సిబ్బంది పట్టుకుని స్టెరిలైజేషన్‌కు తరలించారు. శనివారం సీతారాంపట్నం ఏరియాలో కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ ఆధ్వర్యంలో వీధుల్లో తిరుగుతున్న కుక్కలను పట్టించి ఆటోలో కొత్తగూడెం స్టెరిలైజేషన్ సెంటర్‌కు తరలించారు. అనంతరం వీటిని తిరిగి అదే ప్రదేశాల్లో వదిలివేస్తామని కమిషనర్ తెలిపారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కొత్తగూడెంఅర్బన్: జామియా మిల్లియా సెంట్రల్ యూనివర్సిటీ న్యూ ఢిల్లీ వారు మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ మహిళా అభ్యర్థులకు అందిస్తున్న సివిల్ సర్వీసెస్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంఘం అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ ఉచిత శిక్షణను పొందేందుకుగాను యూనివర్సిటీ వారు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షలో మెరిట్ సాధించాలని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు వెబ్‌సైట్‌లో ఈ నెల 25లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని వివరించారు.

వరకట్నం వేధింపులపై కేసు

పాల్వంచరూరల్: అదనపు కట్నం కోసం వివాహితను వేధిస్తున్న భర్త, అత్తమామలపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. మండలంలోని పునుకులకు చెందిన దాసరి స్నేహప్రియకు 2013లో గార్లబయ్యారానికి చెందిన క్రాంతికుమార్‌తో వివాహం జరిగింది. ఆ తర్వాత అదనపు కట్నం కోసం అత్తింటి వారు వేధిస్తుండడంతో ఆమె చేసిన ఫిర్యాదుతో భర్త, అత్తామామలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

ఆర్థిక సాయం

పాల్వంచరూరల్: మండల పరిధి దంతలబోరు ఎస్సీకాలనీ గ్రామానికి చెందిన సిద్దెల కృష్ణంరాజుకు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ గద్దల రమేష్ శనివారం కృష్ణంరాజు ఇంటికి వెళ్లి రూ.4వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కొలుకునేంత వరకు ఆస్పత్రి ఖర్చు కూడా తానే భరిస్తానని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యేకు అభినందన సభ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి: ప్రజా సంక్షేమం కోసమే అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఇల్లెందు ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ తెలిపారు. శనివారం తొమ్మిదో మైలుతండా పంచాయతీ కోటల్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజల అభినందన సభలో ఆమె మాట్లాడారు. కోటల్ల నుంచి తొమ్మిదో మైలుతండాకు పక్కా రోడ్డు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే బీటీ రోడ్డుకు రూ.3 కోట్లు మంజూరు చేయించారు. దీంతో గ్రామస్తులంతా ఎమ్మెల్యేకు హారతితో ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్, చీమల సత్యనారాయణ, బాణోతు రామ, ఉండేటి బసవయ్య, బాణోతు రవి, జాటోతు నరేష్, కుమ్మరి చౌదరి, రాజు, వీరన్న, భద్రు, బాలు, సీతారాం, శ్రీనివాస్, సమ్మయ్య, బాబు, రాజశేఖర్ పాల్గొన్నారు. అనంతరం ఇదే గ్రామానికి చెందిన కొట్టెం శిరీష ఇటీవల మృతి చెందగా ఆమె ఇంటికి వెళ్లి తల్లిదండ్రులు ముత్తయ్య, పద్మలను పరామర్శించారు. టేకులపల్లిలో టీడీపీ సీనియర్ నేత గుడిపూడి మోహన్‌రావు మాతృమూర్తి ఇటీవల మృతి చెందగా వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నిరుద్యోగ నిరసన సభకు తరలండి

ఇల్లెందు: ఈ నెల 8న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ మైదానంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరుద్యోగ నిరసన సభను విజయవంతం చేయాలని యువతకు కాంగ్రెస్ జిల్లా నాయకులు డాక్టర్ జి.రవి పిలుపునిచ్చారు. శనివారం ఇల్లెందులో విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రియాంక గాంధీ హాజరువుతున్న ఈ సభను సక్సెస్ చేసేందుకు నిరుద్యోగులు అధిక సంఖ్యలో తరలివెళ్లాలని కోరారు. అదేవిధంగా కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ఇందిరమ్మ రాజ్యం లక్ష్యంగా సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర 50వ రోజు 600 కిలోమీటర్లు చేరుకున్న సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భట్టికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, కృష్ణ, గోపాల్, తిరుమల్, జ్యోతి, రవి, అరవింద స్వామి, పాషా, సాయి పాల్గొన్నారు.

శ్రమశక్తి అవార్డు గ్రహీతలకు సన్మానం



ఇల్లెందు: రంగనాథ్‌ను సత్కరిస్తున్న జీఎం షాలేమురాజు

ఇల్లెందు: శ్రమశక్తి అవార్డు గ్రహీత టీబీజీకేఎస్ నేత ఎస్.రంగనాథ్‌ను ఏరియా జీఎం షాలేమురాజు ఘనంగా సత్కరించారు. శనివారం జీఎం చాంబర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించి, అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, అధికారుల సంఘం అధ్యక్షుడు పంజాల శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, ఎస్టేట్ అధికారి మహేశ్వర్, శివకుమార్, డీవైపీఎం పర్సనల్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు సీహెచ్‌పీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. పిట్ సెక్రెటరీ శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్, రాజు, ప్రవీణ్, వీరస్వామి, ప్రకాష్, సలీం, ముఖేష్, భట్టు రవి, సంతోష్, రాజశేఖర్, రవినాయక్, రామలింగం పాల్గొన్నారు.


సింగరేణి(కొత్తగూడెం): వీరభద్రయ్యను సన్మానిస్తున్న అధికారులు, ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): శ్రమశక్తి అవార్డు గ్రహీత కూసన వీరభద్రయ్యను శనివారం పీవీకే–5షాఫ్ట్ గని సీ రిలే అధికారులు, ఉద్యోగులు కార్మికులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గని మేనేజర్ పాలడుగు శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఏళ్లుగా కార్మికులకు చేసిన సేవలను గుర్తించిన ప్రభుత్వం శ్రమశక్తి అవార్డును అందజేసినట్లు చెప్పారు. భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పిట్ సెక్రటరీ చిలక రాజయ్య, బూటుక రాజేశ్వరరావు, అసిస్టెంట్ మేనేజర్ ఈశ్వరయ్య, అండర్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, నల్ల అరుణ్‌బాబు, దాసరి వెంకటేశ్, మూడి వెంకటేష్, అంకం రాజయ్య, ఆరే రాజు, కొప్పుల శ్రీనివాస్, గజ్జల ఈశ్వర్‌రావు, పుల్లారెడ్డి, సారయ్య, దుర్గాప్రసాద్, రాజేందర్, పోతరాజు పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్‌లో రచ్చరచ్చ


సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ సాధారణ సమావేశం రచ్చరచ్చగా మారింది. శనివారం మున్సిపల్ సాధారణ సమావేశం చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సమావేశం ప్రారంభానికి కోరం లేకుండా ఎలా ప్రారంభిస్తారంటూ అసమ్మతి కౌన్సిలర్లు అధ్యక్ష వర్గాన్ని నిలదీశారు. 12 మంది సభ్యులు ఉన్నందున సమావేశం ప్రారంభించామంటూ అధ్యక్ష వర్గం పేర్కొంది. ఈ క్రమంలో మైకు ఏర్పాటు చేయలేదంటూ వైస్ చైర్మన్ జానీపాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. అజెండాలోని అంశాలను నివృత్తి చేసేందుకు అధికారులకు బదులు చైర్మన్ డీవీ సమాధానం ఇవ్వటాన్ని కొంతమంది తప్పుబట్టారు. ఈ సమావేశం చైర్మన్ డీవీ అధ్యక్షతన జరుగుతుందని, ప్రతీ అంశానికి చైర్మన్ సమాధానం ఇవ్వవచ్చని, చైర్మన్ సూచిస్తే అధికారులు సమాధానం చెబుతారంటూ కమిషనర్ అంకుషావలీ సమాధానం ఇచ్చారు. అలా మున్సిపల్ చట్టంలో ఉంటే తమకు సూచించాలని సభ్యులు కోరారు. అజెండాలోని పలు అంశాలు ఏడాదికి పరిమితం చేశారని సభ్యులు తెలుపగా మూడు నెలలకు పరిమితం చేస్తూ తీర్మానం చేయాల్సిందిగా ఎమ్మెల్యే హరిప్రియ సూచనతో అన్ని అంశాలు మూడు నెలలకు పరిమితం చేస్తున్నట్లు ప్రకటించారు. సమావేశానికి కోరం పూర్తి కావాలంటే 13 మంది అవసరమని, తీర్మానాలకు మాత్రం 9 మంది ఉంటే ఎలా ఆమోదం చేసుకుంటారని సభ్యులు ప్రశ్నించారు. ఎమ్మెల్యే హరిప్రియ రాకముందు చైర్మన్ డీవీ, వైస్ చైర్మన్ జానీ మధ్య, అధికార పక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఎమ్మెల్యే రాకతో సద్దుమణిగింది. 67 అంశాలు ఎజెండాలో ఉండగా 64 అంశాలను చర్చించి ఆమోదించారు. సమావేశంలో ఎమ్మెల్యే హరిప్రియ పాల్గొనగా మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వరరావు, కమిషనర్ అంకుషావలీ, డీఈ నరేష్‌రెడ్డి, ఏఈ కుమారస్వామి, అవుట్ సోర్సింగ్ ఏఈ శంకర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నిర్వహణా లోపంతో మరమ్మతులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధి సత్తుపల్లిలోని సీహెచ్‌పీలో నిర్వహణ లోపించడంతో తరచూ మరమ్మతులు వస్తున్నాయని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు అన్నారు. కొత్తగూడెంలో శనివారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. సీహెచ్‌పీలో మరమ్మతుల కారణంగా బొగ్గు రవాణాకు అంతరాయం వాటిల్లుతోందన్నారు. యజమాన్యం నిర్వహణపై దృష్టి సారించాలని, కిష్టారం ఓసీ కాలనీలో కనీస వసతులు కల్పించాలని కోరారు. విజయగిరి శ్రీనివాస్, కర్ల వీరస్వామి, బి.ప్రకాశ్, రమణ, సర్వేశ్వరరావు, ఎం.నాగరాజు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

నిల్వ నీటిలో నడిచేదెట్లా?

పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా టేకులపల్లి మండలం కొత్తతండా(పి) ప్రజలు అవస్థలు పడుతున్నారు. రామాలయం సమీపంలో ప్రధాన రహదారి రోడ్డుపై వర్షపు నీటితో బురద గుంత తయారైంది. ఇక్కడ రోడ్డు లోతట్టుగా ఉండటం వలన వరద పారుదల లేదు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డు ద్వారానే తడికలపూడి, తావుర్యాతండా, కోక్యాతండా, స్టేషన్ తడికలపూడి తదితర గ్రామాలకు నిత్యం రాకపోకలు సాగుతుంటాయి. మురుగు కంపుతో నానా తంటాలు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– టేకులపల్లి



ప్రశ్నించాల్సిన అధికారి : ఎన్.పవిత్ర, ఇన్‌చార్జ్ కార్యదర్శి, కొత్తతండా(పి)
సెల్ నెంబర్: 7337200229